కామెడీ కథ

# ఆంధ్ర కోడలు- ఆవకాయ పచ్చడి

'నిఖిత' అపార్టమెంట్‌లోని నలభై కుటుంబాలవాళ్ళూ ఆత్రుతగానూ ఆనందంగానూ వున్నారు. దానిక్కారణం ఫస్ట్‌ఫ్లోర్‌లోని సరస్వతిగారి కోడలు కాపురానికొస్తోంది. సెలవురోజు కావడంతో పిల్లలూ, పెద్దలూ కూడా ఎదురుచూస్తున్నారు. ఆ అపార్ట్‌మెంట్స్‌లో అన్ని రాష్ట్రాల నుంచి వచ్చినవాళ్ళు వున్నారు.

సరస్వతిగారి కుటుంబమొక్కటే ఆంధ్రా వాళ్లు. ఆమె భర్త మహదేవ్ వ్యాపారీత్యా స్థిరపడ్డారు. ఒక కంపెనీలో చిన్న వాటాదారుడు. సరస్వతిని పెళ్ళి చేసుకొని ఢిల్లీలో కాపురం పెట్టారు. ఐదారు సంవత్సరాలకి ఒకసారి మాత్రమే ఆంధ్రా వెళ్ళి చూసి వస్తుంటారు.

ఆమె తెలుగింటి పిల్లయినా పదహారేళ్ళకే ఢిల్లీలో అడుగుపెట్టడం వల్ల అన్నీ ఉత్తరాది వేష భాషలు, ఉత్తరాది తిండీ, ఆ రుచులూ వంటబట్టాయామెకి. ఎవరైనా చెబితే తప్ప తెలుగువాళ్ళ అమ్మాయి అనుకోరు. అలా స్థిరపడ్డ పిల్లలిద్దరికీ మాత్రం ఆంధ్రాలోనే పెళ్ళి చేయాలనుకున్నారు. అబ్బాయి మహేంద్రకి తూర్పుగోదావరి జిల్లాలోని కోనసీమ పిల్ల సుజాతతో పెళ్ళి జరిపించి వచ్చేశారు. పెళ్ళయ్యాక ఇప్పుడే మొదటిసారి రావడం.

ఆంధ్ర వాళ్ళు సారె ఘనంగా పెడతారని తెలిసి అవన్నీ చూడాలని అపార్ట్‌మెంట్స్‌లోని వాళ్ళు ఎదురుచూస్తున్నారు ఉత్సాహంగా. భాషలు, రాష్ట్రాలు వేరైనా వాళ్ళంతా కలిసి మెలిసి వుంటారు. కష్టసుఖాలను పంచుకుంటారు. కులమత భేదం లేని అనుబంధం వాళ్ళమధ్య వుంది.

స్టేషన్ నుండి ఫోన్ వచ్చాక సుందర్‌లాల్‌గారి టాటాసుమోను తీసుకెళ్ళారు వాళ్ళ కోసం. అపార్ట్‌మెంట్స్ మెయిన్‌గేట్ వద్ద 'వెల్‌కమ్ టు మహీ అండ్ సుజీ' అన్న బోర్డు చూసి సుజాతకి ఆనందం కలిగింది. వాళ్ళంతా తమకోసం అలా ఎదురుచూడటం వింతగానూ అనిపించింది. నగరాలలో ఒకళ్ళను ఒకళ్ళు పట్టించుకోరనీ, ఎవరి పని వాళ్ళదేనని అనుకొంటారు కదా.

అత్తమామలు వున్నా బొత్తిగా ఇరుగు పొరుగులు, స్నేహితులు లేకుండా ఎలా వుండాలో అని భయపడింది. కానీ... వీళ్ళిలా పూలమాలలతో స్వాగతం చెబుతుంటే చాలా సంతోషం వేసింది. చెరొక పూలదండా ఇచ్చి ''మహీ భయ్యా.. నీ పెళ్ళి మేం చూడలేదు కదా. నువ్వు ఇప్పుడు మా ఎదురుగా భాబీకి దండ వెయ్యాలి, భాబీ నీకు వెయ్యాలి'' అని పట్టుబట్టారు. ''అలాగే'' అంటూ దండలు మార్చుకున్నాక చప్పట్లు కొడుతూ పూలు జల్లారు.

కారులోని ప్యాకెట్లన్నీ తలొకటీ వాళ్ళ హాల్లో పరిచేశారు. సరస్వతిగారు అవన్నీ విప్పి చూపించింది అందరికీ. పెద్దసైజు వెలక్కాయలంత లడ్డూలు, కోనసీమ కొబ్బరితో, స్వచ్ఛమైన నెయ్యి, యాలకుల పొడితో చేసిన పంచదార చలిమిడి, ఇంకా కజ్జికాయలు, పూతరేకులు, పొంగడాలు, తాపేశ్వరం కాజాలు వున్నాయి.

పసుపు, కుంకుమలతోపాటు అప్పడాలు, వడియాలు, చల్లమిరపకాయలు, ఒక పెద్ద కేన్ నిండా కళ్ళు చెదిరే ఎర్రని కొత్త ఆవకాయపచ్చడి. దాని ఘుమ ఘుమలకు అందరికీ నోరూరిపోయింది. ఇదివరలో సరస్వతి ద్వారా ఆంధ్రా ఆవకాయ రుచి చూసి వున్నారు. కొందరైతే 'ఆవకాయ ఆంటీ' అని కూడా పేరుపెట్టారు. ఆమె ఇదివరలో ఆంధ్రానుండి తెచ్చుకున్న ఆవకాయ జాడీ రెండు రోజుల్లోనే ఖాళీ అయిపోయేది. మళ్లీ పెట్టుకుందామన్నా సరస్వతికి రాదు. బజారులోని సీసాల్లో పచ్చడి కొనుక్కుంటుంది.

ఇప్పుడు సారెతోబాటు ఆవకాయను చూసిన వాళ్ళు ''మళ్ళీ మీ ఆంధ్రా ఆవకాయను రుచి చూస్తామన్నమాట సరస్వతిగారూ'' అన్నారు.

''మీకంటే నాకు ఎక్కువ ఎవరు'' అంది సంతోషంగా. తన కోడలు 'ఆవకాయ' తేవడం గర్వంగా అనిపించింది. సారెతోపాటు ఆ... ఆవకాయ పచ్చడి కూడా ఒక్కో గిన్నెడు పంచి... విడ.

ఆరోజు భోజనాల దగ్గర జాడీలో అడుగు... కొద్దిగా వున్న పచ్చడి చూసి ''సరూ... జాడీ ... చేసేశావ్, అందరికీ పంచేశావా? మనకి కొంచెం దాచవద్దా'' అన్నాడు భర్త చిరుకోపంగా.

''వాళ్ళు అంత ఆప్యాయంగా అడుగుతుంటే ఎలా దాచనండీ. మనకి కోడలు మళ్ళీ పెడుతుంది లెండి. కోనసీమ కోడలిని కోరి కోరి చేసుకున్నది అందుకేగదా. వాళ్ళ నానమ్మ చెప్పింది, సుజాతకు అన్ని వంటకాలు, పచ్చళ్ళు వచ్చు. నేనంటే చిన్న పిల్లగనే వచ్చాను గనుక అప్పట్లో నాకేమీ మన వంటకాలు సరిగా రాలేదు. సుజాతకి వచ్చే వుంటాయి లెండి'' అంది.

''ఇక్కడ పెట్టాలంటే చాలా శ్రమ, ఖర్చు గదా సరూ'' అన్నాడు.

''ఆ రుచి ముందు ఖర్చు, శ్రమ లెక్కలేవు లెండి. నేను సాయం వుంటాగా. ఇద్దరం కలిసి ఆవకాయ పెట్టి మీకు సిద్ధం చేస్తా, సరేనా'' అంది ఆవకాయ పెట్టడం కోడలికి వచ్చన్న ధీమాతో.

''మమ్మీ... నేను కూడా భాబీ దగ్గర పచ్చడి తయారుచేయడం నేర్చుకుంటాను'' అంది కూతురు రీటా.

''నీకసలు వచ్చా?'' అన్నట్టుగా సుజాత వైపు చూశాడు మహేంద్ర.

సుజాత గబగబా చెయ్యి కడిగేసుకుని వెళ్ళిపోయింది. పరాకుగా వున్న ఆమెను ''సుజీ... అలా వున్నావేం, అప్పుడే మీవాళ్ళమీద బెంగగా వుందా?'' అని ఆప్యాయంగా అడిగాడు మహేంద్ర.

''అదేం లేదు. బాగానే వున్నానే'' అంది. కానీ ఆమెకి ఆవకాయ గురించి గుబులుగా వుంది. నిజంగానే తనతో ఆవకాయ పెట్టించేలా వుంది అత్తగారు. ఎలాగ తప్పించుకోవాలి? అని సతమతమౌతోంది.

★ ★ ★

ఆరోజు.. పెళ్లిచూపుల రోజు.. నానమ్మను అడుగుతోంది అత్తగారు. ''సుజాతకు వంటలు వచ్చా పిన్నిగారూ?''

''ఆ... వచ్చునమ్మా, అన్నీ బాగానే చేస్తుంది. కాకపోతే పెద్ద పెద్దవి ఎక్కువమందికి చెయ్యలేదు''

''మాకు ఎక్కువమంది ఎవరులెండి. కోడలితో వంట చేయించాలని కాదుగానీ మన వంటలు నాకు సరిగా రావు పిన్నిగారూ.. నేనేమీ నేర్చుకోకుండానే ఢిల్లీ వెళ్ళిపోయాను. నా చిన్నప్పుడు అమ్మ వండిపెట్టిన రుచులు గుర్తుచేసుకుని మురిసిపోవడమే. ఆ ఉత్తరాది వంటలే నేర్చుకున్నాను.

ఆయనకు ముందునుంచీ ఆ వంటలే అలవాటు కదా! ఇప్పుడు సుజాత వల్ల మళ్ళీ మన వంటలు రుచి చూస్తాను'' అంది సంబరంగా.

మనవరాలి ప్రతిభ ఆవిడకి తెలుసు. ''అదెంతలేమ్మా. సుజాతకి మన ప్రాంతం వంటలు బాగా వచ్చు'' అంది.

''అన్నట్టు పిన్నిగారూ! ఆవకాయ పెట్టడం వచ్చా?'' ఆత్రుతగా అడిగింది.

''ఆహా...! మా చక్కగా వచ్చు. అది తెలివైన పిల్ల. ఇక్కడ పెట్టే అవ సరం లేక ఎప్పుడూ పెట్టలేదుగానీ, ఒకసారి చెప్తే చాలు, నేను నేర్పిస్తా మూ'' అంది.



''తప్పకుండా నేర్పండి. మన ఆవకాయ అంటే మాకందరికీ కూడా ఇష్టం. మా అమ్మమ్మవాళ్ళ మేం వచ్చినప్పుడు ఇచ్చినవే మాక ప్రాణం'' అంటూ ఆమె ఏవేవ చెప్తూనే వుంది. ఈవిడ వింటూ ఒ టికి వాలుగు ఎక్కువ చెప్తుంటే ప్రక్క గదిలోకి వెళ్ళిపోయింది సుజాత.

వాళ్ళు వెళ్ళిపోయాక నానమ్మత పెద్ద యుద్ధమే జరిగింది.

''నాకు వంటలన్నీ వచ్చు చెప్పావే? ఇక వంటింట్లో వాళ్ల వండివారుస్తూ కూర్చోనా? నేన పీజి చేసింది ఎందుకూ? వీళ్ళ వండిపెట్టడానికా? నేను ఏదో ఒ జాబ్ చేయాలని నా ఉద్దేశం. అ వాళ్ళకి ముందే చెప్పు ముసలమ్మా కేవలం వంట అంటే నాకీ పెళ్ళే వద్దు'' అని చింద సింది.

''అదికాదే పిచ్చిదానా. నామాట స్త విను. మీ అత్తగారు చాలా మంచిదే. పట్టి గోళామనిషి. మంచి మనసున్నది. ఎక్కడో ఫ డటం వలన మన రుచులు, పద్ధతులు అంటే ప్రేమ, అభి మానం. నీకు కొన్ని కూరలు అవీ చ్చుకదా. మరి కొన్ని నేను చెప్తాను. ఒక పుస్తకంలో రాసుకో. అలా చేస్తుంటే అదే అలవాటవుతుంది. ంట చెయ్యా లని ఇంత మంచి సంబంధం వదు కుంటావుటే. వాళ్ళింట్లో వంటమనిషి ఉందిట నువ్వే వండి వార్చక్కర్లేదు'' అని బుజ్జగించింది

ఆ మాటలకి కాస్త మెత్తబడి ''సరే ఇదిగో పుస్తకం, వ్రాయి'' అంది.

''నే చెప్తా రాసుకోమ్మా''

''ఏమిటీ... ఇదో గొప్పపనిల నేను రాసుకోవాలా!. రాస్తే రాయి, లేదా... అసలు నాకీ పెళ్ళే వద్దు'' అని కస్సున లేచింది సుజాత.

''అవేం మాటలే. శుభమా అని నిశ్చితార్థం కూడా జరిగాక అలా అనవచ్చా?'' అని మందలించి కళ్ళజోడు, పుస్తకం తీసుకొని లేచింది.

ముఖ్యమైన కొన్ని వంటలు రాసి, ఆవకాయ, టమాటా, ఉసిరి పచ్చళ్ళ తయారీ కూడా వ్రాసింది. వచ్చేటప్పుడు ''నీ సూట్‌కేస్‌లో పెట్టుకో సుజాతా'' అని మంచంపై పెట్టింది.

తాను పెట్టిందో, మరచిపోయిందో అని గాభరా పుట్టింది. మహేంద్ర పడుకున్నాక అంతా వెతికింది. ఎక్కడా లేదు. తను పెట్టుకోవడం మర్చిపోయింది. ఎలా? తప్పు తనదే. 'ఈ ఆవకాయ గండం ఎలా తప్పుతుంది?' అనుకుంటూ నిద్రలోకి జారుకుంది.

ఎం.ఎల్.సూర్యకాంతం

వంటంతా అయిపోయాక ''అమ్మా సుజీ... ఈరోజు శుక్రవారం కదా, కాస్త పులిహోర చెయ్యి'' అంది సరస్వతి.

ఒక్కసారి పులిహోర గుర్తుచేసుకుంది. పోపులు, రైస్, చింతపండు గుర్తుకు వచ్చాయి. చకచకా పోపుచేసి, కరివేపాకు తుంచి, చింతపండు రసం వేసింది. పోపులు వేయించి, అన్నం వేసేసి, ఆపైన చింతపండు రసం పోసి కలిపేసి, పావుగంట సిమ్‌లో వుంచి స్టౌ కట్టేసింది. 'హమ్మయ్య' అని బయటికొచ్చింది.

★ ★ ★

మహేంద్ర ఎవరితోనో వచ్చాడు. తల్లిని చూసి ''అమ్మా! ఈరోజు రాజా భయ్యాని కూడా డిన్నరుకి తీసుకొచ్చేశా'' అన్నాడు.

ఇంతలో సుజాతను చూసి ''సుజీ! ఇతను

చందూరాజ్. వీళ్ళది కర్ణాటక. మా కంపెనీలోనే పనిచేస్తున్నాడు'' అని పరిచయం చేశాడు. మనతో పాటు ఇతనికీ డిన్నర్ ఏర్పాటుచెయ్యి'' అన్నాడు.

అన్నీ రెడీ చేసి తనూ కూర్చుంది. ముందుగా పులిహోర వడ్డించుదామని మూత తీసింది. ''మహీ... ఈరోజు సుజాత పులిహోర స్పెషల్ చేసిందిరా'' అంది తల్లి.

''పులిహోర చాలా బాగుంటుందమ్మా. మొన్న వాళ్ళింట్లోనే తిన్నాను నేను. సుజా ఎప్పుడూ చెయ్యలేదు'' అన్నాడు.

సుజాత పెట్టిన గరిటె ఊడి రావడం లేదు. చింతపండు పులుసుతో ఉడికిన రైస్ బాల్స్‌లాగ తయారయింది. తల్లీ, కొడుకు, వచ్చిన అతిథి మొహమొహాలు చూసుకుంటూ, వస్తున్న నవ్వుని ఆపుకుంటున్నారు. పొడి పొడిగా వుండాల్సిన పులిహోర ఇలా వుందేమిటా అని బిత్తరపోయింది సుజాత.

ఆమెకి రాదని వాళ్ళకర్థమైంది. ఆమె చిన్నబుచ్చుకోరాదని ''అమ్మా... దీన్ని పులిహోర కేక్ అంటారు. మొన్న వాళ్ళ నానమ్మ కూడా చేసింది'' అంటూ తనే అందరికీ వడ్డించాడు. పాలిపోయిన మొహంతో ఉన్న సుజాత ఎలాగో తిని అందరితో పాటు లేచింది.

గదిలో కూర్చుని బిక్కమొహం వేసిన సుజాతని గమనించి ''సుజీ... ఇప్పుడేమయిందనీ, అలా దిగులుగా కూర్చున్నావ్. నీకు ఆ వంటకం కుదరలేదని బాధగా ఉన్నట్టుంది. ఈసారి బాగా ట్రై చెయ్యి. దాని రుచి కూడా చాలా బాగుంది సుమా'' అని ఊరడించాడు.

★ ★ ★

మామగారు పంపిన మామిడికాయలు చూసి గుండె గుభేల్‌మంది సుజాతకి. ఒక్కసారి ఇంటిదగ్గర ఆవకాయ పెట్టే సీన్ గుర్తొచ్చింది. పెరట్లో వేపచెట్టు క్రింద రోట్లో ముగ్గురు కారం దంచుతుండేవారు, మరో ఇద్దరు తిరగట్లో ఆవపిండి విసురుతుండేవారు. ఇద్దరు మగాళ్ళు పెద్ద పెద్ద కత్తిపీటలతో కాయల్ని ముక్కలుగా కోస్తుంటే, ముగ్గురైదుగురు పిల్లలు జీడి తీసి శుభ్రం చేసేవారు. అమ్మ, నానమ్మ జాడీలు శుభ్రం చేస్తూ, బేసిన్‌లు సిద్ధపరుస్తూ హడావిడిగా అటూ ఇటూ తిరుగుతుండేవారు. అన్నీ రెడీ అవడానికి సాయంత్రం అయ్యేది. గుట్టలా ఉన్న మామిడిముక్కల్ని కొలిచి అన్నీ సమపాళ్ళలో కలిపి అమ్మ, నానమ్మ జాడీల్లో వేసేవారు. ఈ హడావిడికి బేజారెత్తి తను ఫ్రెండ్ ఇంటికి వెళ్ళిపోయేది.

''ఏమే సుజాతా! నువ్వు పని చెయ్యకుంటే మానేయిగానీ, కనీసం పచ్చడి ఎలా కలుపుతున్నామో చూడకూడదుటే. రేపు పెళ్ళయ్యాక ఎలా తెలుస్తుందే?'' అనేది నానమ్మ మందలింపుగా.

''నువ్వు ఉన్నావుగా నానమ్మా. నాకు నువ్వే పెట్టి పంపుతావుగా'' అని తప్పించుకునేది. కనీసం చూసినా ఈరోజు ఇంత కంగారుపడాల్సిన పని లేకపోయేది. 'సరే చూద్దాంలే... అన్నీ కలిపేస్తే అదే తయారవుతుంది' అని సర్దిచెప్పుకుంది.

కాయలు తెచ్చిన మనిషి ముక్కలు కోసి వెళ్ళిపోయాడు.

''అమ్మా సుజా... ఏం కావాలో లిస్టు రాయి. కారం పొడీ అవీ రెడీమేడ్‌గా దొరుకుతాయి తెప్పిస్తాను'' అంది అత్తగారు.

''సూపర్‌బజార్ దగ్గరే కదా... నేను వెళ్ళి తెస్తాను అత్తయ్యా'' అని వెళ్ళింది. తన ఊహకి సరిపడా తెచ్చింది. అవన్నీ కలిపి అత్తాకోడలు జాడీలో వేశారు.

మర్నాడే ''పచ్చడి తియ్యనా సుజా'' అంది అత్తగారు.

''మూడురోజులు వుండాలి అత్తయ్యా'' అంది ధీమాగా. అది మాత్రం బాగా గుర్తు. మూడవ రోజున ఎర్ర ఎర్రని కొత్త ఆవకాయ తినడం మరపురాని అనుభూతి. మిగిలిన ఫ్లాట్స్‌లోనివాళ్ళు కొందరు ఆవకాయ కలపడం చూశారు. మొత్తం అందరికీ తెల్సిపోయింది. 'ఆంధ్రాకోడలు ఆమ్ అచార్ పెట్టిందిట' అని ఒక సాహసంలా చెప్పుకున్నారు.

మూడవరోజు ఇంట్లోవాళ్ళు కొత్త ఆవకాయ రుచి చూడడానికి థ్రిల్ అయిపోయి సుజాత జాడీ తీస్తుంటే చుట్టూ చేరారు. ఇంద్రజాలికురాలిలాగా జాడీమీద కట్టిన గుడ్డ తొలగించి మూత తీసింది. పైన తెల్లని ఫంగస్, బూజు మొలకలు అప్పుడప్పుడే దర్శనమిస్తున్నాయి. తలెత్తి వాళ్ళ ముఖాల్లోకి చూడలేకపోయింది.

''కోనసీమ పిల్లవని కోరి కోరి చేసుకున్నాను. ఆవకాయ పెట్టడమూ రాదు, పులిహోర చెయ్యడమూ రాదు. అప్పట్లో నేను నేర్చుకునే వయస్సు లేక, సమయమూ లేక నేర్చుకోలేకపోయాను. ఏ దేశాలు తిరిగినా మన ఆంధ్రా వంటకాలూ పచ్చళ్ళూ ఎక్కడైనా స్పెషలే. ఆంధ్రా అమ్మాయిలు మహేంద్రకి ఇక్కడా ఉన్నారు చెయ్యాలంటే. కానీ... అక్కడ పుట్టిపెరిగిన పిల్లయితే చదువుకు చదువూ, సంస్కారం, సాంప్రదాయం ఇలాంటి స్పెషల్ ఐటమ్స్ వచ్చి వుంటాయని భ్రమపడ్డాను. సర్లే, అత్తకు తగ్గ కోడలివని అనుకుంటానులే. ఏం బాధపడకులేమ్మా, కాకపోతే మీ నాయనమ్మ అన్నీ వచ్చని కోతలు కోసిందని నేను పచ్చడి పెట్టమన్నాను. లేకుంటే నిన్ను బాధపెడదామని కాదు సుజీ'' అని అక్కడి నుంచి తప్పుకుంది.


ఇడ్లీ ప్లేటుతో నించున్న మామగారు కారప్పొడి కోసం వెళ్ళిపోయారు. భర్త, రీటా నవ్వుని నొక్కిపట్టి ఓదార్పుగా చూస్తున్నారు. సుజాతకి చాలా సిగ్గుగా అన్పించింది. వాళ్ళు తిట్టినా బాగుండుననిపించింది. తిట్టలేదు. టేబుల్ క్రిందనున్న సాల్ట్ పేకెట్స్ మాత్రం ఆమెని వెక్కిరిస్తూ పక పకా నవ్వుతున్నాయి, అప్పుడు గుర్తొచ్చిందామెకి అన్నీ కలిపి సాల్ట్ మర్చిపోయానని.

★ ★ ★

ఆషాఢ మాసంలో ఇంటికొచ్చిన సుజాత వంటింట్లోకి వస్తుంటే, ''నీకెందుకే తల్లీ ఈపని, నువ్వలా కూర్చొని మీ విశేషాలు చెప్పు'' అంది తల్లి ఆప్యాయంగా.

''అమ్మా! ఈ నెలరోజులూ నేనే వంట చేస్తా. నువ్వు కూర్చొని నాకు చెప్తుండు'' అంది. ఆమెకిప్పుడు అన్నిరకాల కూరలూ నేర్చుకోవాలన్న తహతహ వుంది. అటుగా వచ్చిన నాయనమ్మ ఆ మాటలు విని ముసి ముసిగా నవ్వుకుంది.

''ఇప్పటికైనా తెల్సిందా మనవరాలా! ఎన్ని చదువులు చదివినా, ఎన్ని పదవులు చేపట్టినా ఆత్మీయులకి రుచికరంగా వండి పెట్టడంలోనే ఆనందం, తృప్తీ వుంటాయిరా పిచ్చితల్లీ'' అంది ప్రేమగా.




''అవును నానమ్మా! అప్పుడు నీ మాట విననందుకు బుద్ధి వచ్చింది గానీ, ముందు నాకు ఆవకాయ పెట్టడం నేర్పు'' అంది గారంగా.

''అలాగేలే... మన తోటలో పునాస మామిడికాయలు వున్నాయి. తెప్పిస్తాను, నువ్వే పెడుదువుగానీ'' అంది.

శ్రావణ మాసం రాగానే సంపూర్ణ ఆత్మవిశ్వాసంతో, అచ్చమైన, స్వచ్ఛమైన ఆంధ్రాకోడలిగా ఆనందంగా రైలెక్కింది సుజాత. *